జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 13-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 482 పేజీలు: 4 వెల : రూ.7

# ఫుట్‌పాత్‌లు.. కబ్జా!

**శ్రీకాకుళం, అక్టోబరు 12 (వార్త):** శ్రీకాకుళం నగరంలో రోడ్డుకు ఇరువైపులా లక్షలు రూపాయలు వెచ్చించిన నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. అసలే నగరంలో ఇరుకురోడ్లతో వాహనచోదకులు, పాదచారులు నానాఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాదచారుల కోసం నగరపాలక సంస్థ పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలపై ఫుట్‌పాత్‌లు నిర్మించింది. ఇవి పాదచారులకు ఎంతగానో దోహదపడతాయి. అయితే ఈ ఫుట్‌పాత్‌లను వ్యాపారులు, భవన యజమానులు ఆక్రమించేస్తున్నారు. దీనివల్ల పాదచారులు మళ్లీ రోడ్లపై నుంచే వెళ్లాల్సివస్తోంది. నగరంలోని అన్ని ప్రధాన రహదారుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డు, డే అండ్‌నైట్ జంక్షన్, పాలకొండ రోడ్డు, రైతుబజార్ రోడ్డు, జడ్పీ రోడ్డు.. మార్కెట్ రోడ్డు.. ఇలా అన్ని ప్రాంతాల్లోనూ ఫుట్‌పాత్‌లు కబ్జాకు గురయ్యాయి.









దీనికితోడు చెత్తను ఆయా షాపుల నిర్వాహకులు, భవన యజమానులు డ్రైనేజీలోనే పడవేస్తున్నారు. దీనివల్ల డ్రైనేజీ పూడుకుపోతోంది. చిన్నపాటి వర్షం పడితే చాలు డ్రైనేజీ వాటర్ దిగువకు వెళ్లలేక రోడ్డుపైకి వస్తోంది. దీనివల్ల రహదారులు కంపుకొడుతున్నాయి. ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిపాలవుతున్నారు. పారిశుధ్య కార్మికులు డ్రైనేజీల్లో చెత్తను తీయలేక నానావస్థలు పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు డ్రైనేజీల్లో చెత్త తీసేందుకే లక్షలాది రూపాయలు తగలబెడుతున్నారు.. తప్పా ఫుట్‌పుత్‌లు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ సైతం నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. తక్షణం డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ నగరపాలక సంస్థ అధికారుల్లో ఎటువంటి కదలిక లేకపోవడం గమనార్హం.

* లక్షలు రూపాయలు వెచ్చించి నిర్మాణం
* వాటిని ఆక్రమించి షాపులు, ఇళ్ల కట్టడాలు
* డ్రైనేజీల్లో చెత్తను పడేస్తున్న యజమానులు
* పూడుకుపోతున్న కాలువలు
* చెత్త తొలగించేందుకు నానాకష్టాలు పడుతున్న నగరపాలక సిబ్బంది
* చిన్నపాటి వర్షానికి రోడ్డెక్కుతున్న డ్రైనేజీ వాటర్
* కబ్జాపై కన్నెత్తి చూడని నగరపాలక సంస్థ అధికారులు

## కొత్త గురువులు వచ్చే సార్!

* నేడు విధుల్లో చేరనున్న 528 మంది ఉపాధ్యాయులు
* గతనెల 25న నియామక పత్రాలు అందుకున్న గురువులు
* వీరికి ప్రాథమిక శిక్షణ కూడా పూర్తి
* పాఠశాలల్లో తీరనున్న బోధన కష్టాలు

శ్రీకాకుళం, అక్టోబరు 12(వార్త): మెగా డీఎస్సీలో అర్హత సాధించి ఉద్యోగం సంపాదించిన ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధుల్లోకి రానున్నారు. గతనెల విజయవాడలో ఉద్యోగ నియామక పత్రాలను సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అందుకున్న విషయం తెలిసిందే. జిల్లాకు సంబంధించి 528 మంది కొత్త గురువులు నియామకమయ్యారు. ఇప్పటికే వారు ఏయే పాఠశాలల్లో విధుల్లో జాయిన్ అవ్వాలన్నదానిపై విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. జిల్లాలోని కొత్త ఉపాధ్యాయులకు ఇటీవల తరగతి గదుల్లో ఏవిధంగా బోధించాలన్న దానిపై ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకూ శిక్షణ ఇచ్చిన విషయం తెలిసిందే. ఏదేమైనప్పటికీ కొత్త గురువులు వస్తుండడంతో పాఠశాలలు కళకళలాడనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందనుంది.

## నేడు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటన



**శ్రీకాకుళం, అక్టోబరు12(వార్త):** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో పౌర సరఫరాల శాఖపై నిర్వహించే ప్రాంతీయ సమావేశంలో పాల్గొనున్నారు. ఉదయం పదిగంటలకు కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే సమావేశంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం, విజయ నగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ ఆదివారం వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొం టారు. అలాగే జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాయంత్రం మూడు గంటలకు మిల్లర్స్ అసోషియేషన్, ధాన్యం సేకరణ సంస్థలు, రైతు సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కూడా మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

# ఫీల్డ్‌కు వెళ్లరు.. ప్రజారోగ్యం పట్టించుకోరు!

* ఏసీ రూములకే ఫీల్డ్ సిబ్బంది పరిమితం
* ఎఫ్‌టిఏ నిధులు దుర్వినియోగం
* వైద్యుల సమ్మెతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న నౌపడ పీహెచ్‌సీ సిబ్బంది
* చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

**సంతబొమ్మాళి, అక్టోబరు12 (వార్త):** ప్రతిరోజు పీహెచ్‌సీకి వచ్చి అటెండెన్స్ బయోమెట్రిక్ వేసుకొని ఫీల్డ్ లో తిరిగి కింది స్థాయి వైద్య సిబ్బంది పనితీరును, ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోవాల్సిన ఫీల్డ్ సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్‌ఈఓ ఫీల్డ్‌కు వెళ్లకుండానే మూమెంట్ బుక్‌లో వారికి నచ్చిన రూటుని రాసుకోవడం, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశల పనితీరును ఫీల్డ్‌కు వెళ్లి పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ అవేవీ పట్టించుకోకుండా ఆరోగ్య కేంద్రంలోనే తిష్ట వేసుకుంటున్నారు. వీరి పర్యవేక్షణ కొరవడంతో కింది స్థాయి సిబ్బంది పనితీరు అంతంతమాత్రంగానే ఉందని ఆరోపణలు వస్తున్నాయి. వైద్యాధికారులకు అడ్వాన్సుడ్ టూర్ ప్రోగ్రాం (ఏటీపీ) ఇవ్వాల్సి ఉన్నప్పటికీ అది కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. అలాగే ఎంపీహెచ్‌ఈఓ ఫీల్డ్‌లో తిరిగి వైద్య సిబ్బంది పనితీరు పర్యవేక్షించేందుకు ఎఫ్‌టిఏ (ఫిక్సిడ్ ట్రావెల్ అలవెన్స్) ఇస్తున్నప్పటికీ ప్రతి ఏడాది ఎఫ్‌టిఏ తీసుకుంటున్నారే తప్ప ప్రతీ రోజు ఫీల్డ్ కి వెళ్లడం లేదని తెలుస్తోంది. ఫీల్డ్‌లో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే లక్ష్యంతో వీరిని ప్రభుత్వం నియమించినప్పటికీ వీరి విధులు మాత్రం అంతంత మాత్రమేనని చెప్పవచ్చు. ఎంపీహెచ్‌ఈఓల పర్యవేక్షణ లోపంతో కొంతమంది వైద్య సిబ్బంది సకాలంలో రోగులకు సరైన వైద్యం అందించలేకపోతున్నారు. ఎంపీహెచ్వో ఆసుపత్రికి వస్తారు.. వెళ్తారు అనే తీరు కాకుండా ప్రతిరోజు ఫీల్డ్‌కి వెళ్లి వైద్య సిబ్బందితో పని చేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.




### అటకెక్కిన పర్యవేక్షణ..

నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై గతం నుండి ఇప్పటివరకు పలుమార్లు పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ పర్యవేక్షణ మాత్రం గాడి తప్పిందని ఆరోపణలు ఉన్నాయి. ఆకస్మిక తనిఖీలు, పర్యవేక్షణ నిర్వహించాల్సిన జిల్లా వైద్యాధికారులు మౌనంగానే ఉంటూ జిల్లాకే పరిమితవుతున్నారు. గత కొన్నేళ్లగా డిఎం అండ్ హెచ్ ఓ పర్యవేక్షణ, తనిఖీలు మచ్చుకైనా లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి సిబ్బంది వరకు ఇష్టారాజ్యంగా మారిందని బహిరంగ విమర్శలు ఉన్నాయి. నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫార్మసిస్ట్, స్టాఫ్‌నర్స్ కొరత ఉన్నప్పటికీ ఉన్నత స్థాయి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో జిల్లా వైద్యాధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

## మహిళల సంక్షేమమే లక్ష్యం

**ఎల్ఎన్‌పేట, అక్టోబరు12(వార్త):** మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం పెద్దకోట గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షులు కాగాన మన్మధరావు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది పెద్దకోట గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షులు కాగాన మన్మధరావు ఈ కార్యక్రమం చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



## సిక్కోలుకు ఉపాధి చేరువ చెయ్యడమే..
# రామన్న లక్ష్యం

* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* మాక్ టెస్ట్‌కు 120 మంది విద్యార్థులు హాజరు
* పరీక్ష సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే
* రామ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు



**శ్రీకాకుళం, అక్టోబరు12(వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆర్.ఆర్.బి, గ్రూప్-డి అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన రెండవ కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం జరిగిన పరీక్ష సరళిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులతో ముచ్చటించారు. ప్రశ్నాపత్రం రూపొందించిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ మాక్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు.. భవిష్యత్ లో జరిగే ప్రధాన పరీక్షలలో కూడా మంచి ప్రతిభ చూపి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కాగా గత



నెల 28న ఇదివరకే మొదటి మాక్ టెస్ట్ జరగగా.. అందుకు కొనసాగింపుగా ఆదివారం శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో ఈ రెండవ మాక్ టెస్ట్ నిర్వహించారు. ఆర్.ఆర్.బి, గ్రూప్ - డి ప్రధాన పరీక్షకు సన్నద్ధం చేసే దిశగా మాక్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని, ఇందుకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కొద్ది రోజుల క్రితం నిర్వాహకులు ప్రకటన విడుదల చేశారు. మొదటి మాక్ టెస్టుకు తీసిపోని స్థాయిలో.. రిజిస్ట్రేషన్ ప్రకటన వెలువడటమే తరువాయి.. వెల్లువలా అభ్యర్థులు తమ వివరాలను పొందుపరిచి హాల్ టికెట్లు పొందారు. ఇందుకోసం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు అత్యంత పకడ్బందీగా ఆదివారం రోజున ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించారు. ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి చేరువ చేసే మార్గాలను దగ్గర చేస్తున్నారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. డిఎస్సి, గ్రూప్స్, కానిస్టేబుల్, ఆర్.ఆర్.బి ఇలా పోటీ పరీక్షలు అన్నింటికీ సమాయత్తం అయ్యేలా యువతను సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి సైతం యువత తరలివస్తున్నారు.

మాక్ టెస్టు నిర్వహించడం, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి అవసరమైన మెటీరియల్ అందివ్వడం, నిష్ణాతులచే తరగతులు చెప్పించడం, పరీక్షకు సన్నద్ధమయ్యేలా వారిని తీర్చిదిద్దే బాధ్యత ఎర్రన్న సంకల్పం చేపట్టింది. సత్ఫలితాల సాధన దిశగా కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో ఎర్రన్న విద్యా సంకల్పం విద్యార్థులు స్పష్టమైన ఫలితాలు సాధించడం ఇందుకు నిదర్శనంగా మారుతోంది. ఆదివారం జరిగిన కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్‌లో మొత్తంగా 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్.ఆర్.బి కి తీసిపోని స్థాయిలో పరీక్షను నిర్వహించారని, ప్రశ్నాపత్రం కూడా ఆర్.ఆర్.బి స్థాయి విలువలతో ఉందని విద్యార్థులు తెలిపారు. ప్రధాన పరీక్షలలో మంచి మార్కులు సాధించడానికి ఈ మాక్ టెస్టులు ఉపయుక్తంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇలాంటి పరీక్షను ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 13 నుంచి 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' ఉత్సవాలు

**శ్రీకాకుళం, అక్టోబరు 12 (వార్త):** జీఎస్టీ 2.0 విజయోత్సవాలను పురస్కరించుకుని 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరుతో నెల రోజుల పాటు ఉత్సవాలను జిల్లాలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 13 నుంచి 19 వరకు ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ప్రత్యేక ప్రదర్శనలు జరగనున్నాయి. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల ప్రకారం, వివిధ విభాగాలు స్టాళ్ల ఏర్పాటు చేయనున్నారు. ప్రజలకు జీఎస్టీ వల్ల కలిగిన సేవింగ్స్‌ను చూపించడానికి ప్రతీ స్టాల్‌లో ప్రీ జీఎస్టీ ధర, పోస్ట్ జీఎస్టీ ధర, సేవింగ్స్ శాతం వివరాలు చూపించనున్నారు. ఆటోమొబైల్స్ స్టాళ్ల ఏర్పాటుకు రవాణా శాఖ, ఎలక్ట్రానిక్స్, కిచెన్ వస్తువులు, మొబైల్ ఫోన్ల స్టాళ్లకు కమర్షియల్ టాక్స్ విభాగం, లేపాక్షి సంస్థలు, పొందూరు చేనేత, ఇత్తడి, హస్త కళల వస్తువులు ప్రదర్శించనున్నారు. సోలార్ పరికరాలు ఎనర్జీ శాఖ ఆధ్వర్యంలో, ఫుడ్ కోర్టులు ఫుడ్ సేఫ్టీ లేదా టూరిజం శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా సామాగ్రి స్టాళ్లు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉత్పత్తులు ప్రజలను ఆకట్టుకునేలా ఉండనున్నాయి. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని, జీఎస్టీతో వచ్చిన సేవింగ్స్ ప్రయోజనాలను తెలుసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, అక్టోబరు 12 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం పదిగంటలకు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. అలాగే అర్జీదారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## అలరించిన పగటి వేషాలు



**కోటబొమ్మాళి, అక్టోబరు12(వార్త):** చిన్న హరిశ్చంద్రపురం గ్రామంలో గౌరిపౌర్ణమి, నందెన్న నవరాత్రులు ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం గ్రామస్థులు వేసిన పగటి వేషాలు అకట్టుకున్నాయి. అంతరించి పోతున్నా కళలను భావితరాలకు అందించే విధంగా పాత అచారాలు, పురాణా ఇతిహాసాలను తెలియజేస్తూ ఈ వేషధారణలు యువతరానికి ఎంతగానో చైతన్యపరిచాయి. గ్రామానికి చెందిన రోణంకి చలపతిరావు, కోట రమణమూర్తి, బగాది ఈశ్వరరావు, దుంపల వెంకటరమణల వేషధారణలు అలరించాయి.

## రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గురయ్య నాయుడు

**పలాస, అక్టోబరు12 (వార్త):** రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శిగా పుక్కల్ల గురయ్య నాయుడిని పార్టీ అధినేత నియమించారు. ఈ సందర్భంగా గురయ్యనాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకంగా అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. తనకు పదవిని కట్టబెట్టిన అధినేత జగన్మోహనరెడ్డికి, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కల్తీ మద్యంపై నేడు నిరసన ర్యాలీ

**పలాస, అక్టోబరు 12 (వార్త):** కల్తీ మద్యంపై విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం నిరసన ర్యాలీ చేపట్టనున్నామని పలాస పట్టణ వైసిపి అధ్యక్షులు శిస్టు గోపి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కల్తీ మద్యం కారణంగా జరుగుతున్న ప్రాణ నష్టం, ప్రజా ఆరోగ్యానికి ఏర్పడుతున్న ముప్పు నేపథ్యంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధ్యక్షతన పలాస నియోజకవర్గం మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు కాశీబుగ్గ శ్రీనివాస లాడ్జి జంక్షన్ వద్ద మానవహారం, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. అనంతరం శ్రీనివాస లాడ్జి జంక్షన్ నుండి ఎక్సైజ్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. పార్టీ నాయకులు, మహిళా విభాగ సభ్యులు, కార్యకర్తలు, కేడర్ అందరూ తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

**పలాస,అక్టోబరు12(వార్త):** బారువ- మందస రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని పలాస జీఆర్పీ ఎస్ఐ కోటేశ్వరరావు ఆది వారం తెలిపారు. శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని మగ వ్యక్తి సుమారు వయసు 30 నుంచి 35 సంవత్సరాలు ఉండి బారువ మందస మధ్య రైలు ట్రాక్‌పై మృతి చెంది ఉన్నాడన్నారు. ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు 9440627567 సమాచారం అందించాలని కోరారు.

## బాలికలు శారీరకంగా బలంగా ఉండాలి

**శ్రీకాకుళం, అక్టోబరు12 (వార్త):** ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో గల ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా కళాశాల వసతి గృహాల సంక్షేమాధికారి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మేరీ కేథరిన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు శారీరకంగానూ, మానసికంగానూ, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలలోనూ ముందంజలో ఉండాలన్నారు. వారిపై లింగ వివక్షత చూపరాదని సూచించారు. బాలికలకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పించడానికి లింగ వివక్షత రూపుమాపడానికి, మహిళా సాధికారత కోసం పోరాటం అనేది బాలికాదినోత్సవం ముఖ్య లక్ష్యమన్నారు. ఈ ఏడాది నేనే అమ్మాయిని, నేనే నడిపించే మార్పుని, ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదంతో ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.మోహినీ రత్నకుమారి మాట్లాడుతూ, బాలికలలో పోషకాహార లోపం, మానసిక ఆరోగ్యం, లైంగిక ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు అవగాహన కలిగివుండాలని తెలిపారు. స్త్రీలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కల్పించాలని తద్వారా కుటుంబ, సమాజ, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ప్రతీ ఒక్కరూ బాలికల ఆరోగ్యాన్ని సంరక్షించే బాధ్యతను కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ డాక్టర్ మంత్రి వెంకటస్వామి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా కళాశాల వసతి గృహాల సంక్షేమాధికారులు ప్రమీల, సరితా, శ్రీదేవి, పూర్ణ, పీహెచ్ఎన్ బి.లక్ష్మీ, ఎస్.అరవింద, డెమో విభాగపు సిబ్బంది సతీష్, పైడి కీర్తి, ఆనంద్, ఏఎంఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాతృమూర్తులదే కీలక పాత్ర



**సరుబుజ్జిలి, అక్టోబరు 12(వార్త):** హిందూ ధర్మంలో మాతృమూర్తుల పాత్ర ఎంతో గొప్పదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ కార్యవహ గోవిందరావు అన్నారు. సంఘ్ విజయ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా, సరబుజ్జిలి మండల కేంద్రంలోని శివాలయంలో ఆదవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజానికి కేంద్ర బిందువు మహిళ అని తెలిపారు. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, సంపతరావు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటీలో కలాం ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యుబేషన్ సెంటర్



**ఎచ్చెర్ల, అక్టోబరు12(వార్త):** విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణా దృష్టి, సాంకేతిక ప్రతిభను పెంపొందించేందుకు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళంలో డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యుబేషన్ సెంటర్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సెంటంర్‌ను ఆప్షన్‌మేట్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో భాగస్వామ్యంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. వీ. జి. డి. బాలాజీ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఆప్షన్‌మేట్ మేనేజింగ్ డైరెక్టర్ పి. శశి కుమార్ పాల్గొన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకాడెమిక్స్ డాక్టర్ ఎస్. రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ సి. హెచ్. వాసు, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జి.రవి, అసోసియేట్ డీన్ కె. రమణ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సి.ప్రకాశ్, కోఆర్డినేటర్ (ఎంట్రెప్రెన్యూర్షిప్ అండ్ ఇంక్యూబేషన్) ఎస్. సతీష్, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

## కలెక్టర్లతో మంత్రి లోకేష్ సమీక్ష

**విశాఖపట్నం, అక్టోబరు12 (వార్త):** ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. పలు అంశాలపై చర్చించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హేమబాబు చౌదరి కుటుంబానికి పరామర్శ



**పలాస, అక్టోబరు 12 (వార్త):** పలాస నియోజకవర్గ కూటమి నాయకుడు హేమబాబు చౌదరి తండ్రి జగ్గు చౌదరి కొద్దిరోజుల క్రితం మరణించారు. విషయం తెలుసుకుని డాక్టర్ దుర్గారావు, పాలవలస కృష్ణమూర్తి, సనపల శ్రీధర్, తమ్మినాన సుధాకర్.. హేమ బాబు చౌదరి నివాసానికి వెల్లి జగ్గు చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హేమబాబు చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు.



## ఏడీఆర్ఎం రామారావుకు సన్మానం

**మందస, అక్టోబరు 12(వార్త):** ఏడీఆర్ఎంగా ఇటీవల బాధ్యతలను కుందు రామారావు స్వీకరించారు. ఎర్రముక్కాంకు చెందిన రామారావుకు విశాఖ పట్నం వాడబలిజ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల కాలంలో పదోన్నతిపై వాల్తేరు డివిజన్ అదనపు రైల్వే మేనేజర్‌గా పదవి బాధ్య తలు స్వీకరించిన కుందు రామారావుకి ఎర్రముక్కాం వాడబలిజ సంక్షేమ విశాఖపట్నం సంఘం ఘనంగా సన్మానించింది. మాతృభూమి ఎర్రముక్కాం నుంచి వెళ్లిన సుమారు 175కుటుంబాలు విశాఖపట్నంలో స్థిర నివాసాన్ని ఏర్పర చుకున్నారు. మాతృభూమి అయినటువంటి సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామానికి వారు ప్రతి కార్యక్రమాలలో చేదోడువాదోడుగా ఉంటున్నారు. ప్రతి ఏడాది వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాతృభూమిలో సేవలను అంది స్తున్న వారికి సన్మానిస్తున్నారు. రామారావుకి ఘన సన్మానం చేయడం మా అదృష్ట మని, రామారావుని యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు కొని యాడారు. రామారావు మాట్లాడుతూ అందరి ఆప్యాయత అనురాగాలతో అతి పేదరికం అనుభవించిన నేను ఈ స్థాయికి రావడం గర్వంగా ఉందని తెలియ జేశారు. చిన్నతనంలో తండ్రి కోల్పోయినప్పటికీ తల్లి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి చంద్రా వతి మనోధైర్యంతో నన్ను ఈ స్థాయికి చేర్చిందని రామారావు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఐఏఎస్, ఐపీఎస్, ఐఈఎస్, ఇండియన్ సర్వీస్ ఉద్యోగాల్లో యువకులు సాధించాలన్నదే నా చిరకాల వాంఛ అన్నారు. కార్యక్రమంలో విశాఖ పట్నం వాడబలిజ సంఘం, ఎర్రముక్కాం గ్రామస్తులు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రాజశేఖర్‌కు బెస్ట్ ఇంటర్నేషనల్ హ్యూమనిటేరియన్ అవార్డు



**జలుమూరు, అక్టోబరు12 (వార్త):** దేశంలో అవినీతి నిర్మూలన కోసం నిరంతరంగా కృషి చేస్తున్న సామాజిక కార్యకర్త, యునైటెడ్ నేషన్స్ ఎగెనిస్టు కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడు రాజశేఖర్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఘనమైన గుర్తింపు లభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి వ్యవహారాలపై ధైర్యంగా ప్రశ్నిస్తూ, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వివిధ శాఖల్లో నిష్ప క్షపాత విచారణలకు దారితీసినందుకు ఢిల్లీ ఆధారిత జీవన స్థాయిని మల్టీపర్పస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ 2025 సంవత్సరానికి 'బెస్ట్ ఇంటర్నేషనల్ హ్యూమనిటేరియన్ అవార్డు'ను ఆయనకు ప్రకటించింది. ఈ అవార్డును ఆ సంస్థ డైరెక్టర్ రాహుల్ పవర్ అందజేశారు. ఈ సందర్భంగా నాయుడు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అవినీతి నిర్మూలన కోసం సాధారణ పౌరుడి స్వరం ఎంత శక్తివంతమైందో నా ప్రయాణం రుజువు చేసిందన్నారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా రెండుసార్లు, శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి జీరో బడ్జెట్‌తో రెండుసార్లు పోటీ చేసిన నాయుడు రాజశేఖర్, ప్రజా సేవను ప్రధాన ధ్యేయంగా కొనసాగిస్తూ ప్రస్తుతం యుఎన్ ఎగెనిస్టు కరప్షన్ నేషనల్ అంబా సిడర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ అవార్డు ఆయన ప్రజాసేవా ప్రయాణానికి మరొక అంతర్జాతీయ మైలురాయిగా నిలిచింది.

## రాజమండ్రిలో మండలవాసి మృతి



**సంతబొమ్మాళి, అక్టోబరు12 (వార్త):** లక్కి వలస పంచాయతీ గెద్దలపాడు గ్రామానికి చెందిన తుంబల చిరంజీవి (25)అనే మత్స్యకార యువకుడు శనివారం రాత్రి రాజమండ్రిలో జరిగిన బైక్ యాక్సి డెంట్‌లో మృతి చెందాడు. రాజమండ్రిలో ఓ హోటల్ లో ఐదేళ్లుగా కుక్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల స్వగ్రామం వచ్చి పది రోజుల కిందట రాజమండ్రి వెళ్లారు. బైక్ మీద వెళ్తున్న చిరంజీవి ఓవర్టేక్ చేయ బోయి లారీ కింద పడి మృతి చెందారు. కుమారుడి మరణ వార్త విని తండ్రి గురువులు తల్లి ఆదెమ్మ కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## చెత్తను తొలగించండి

**జలుమూరు, అక్టోబరు12(వార్త):** చల్లవానిపేట జంక్షన్ నుంచి జలు మూరు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న చెత్తతో ప్రయాణికుల అవస్థలు ఎదుర్కొం టున్నారు. చల్లవానిపేట జంక్షన్‌కు సమీపంలో సుమారు 100 మీటర్లు పొడవున ఈ చెత్త పేరుకుపోవడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు దుర్వాసనకు ఇబ్బం ది పడ్డారు. పందులు, కుక్కలు స్వైర విహారం ఎక్కువగా ఉందని, అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



## గడ్డయ్యపేట జగనన్న కాలనీలో..

# అన్నీ అవస్థలే!

* కాలనీవాసులకు అందని రక్షిత నీరు
* అధ్వానంగా రహదారులు
* పట్టించుకోని అధికారులు



**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు12 (వార్త):** జమ్మూ పంచాయతీ గడ్డయ్యపేట వద్ద ఉన్న జగనన్న కాలనీ వాసులకు తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ ద్వారా రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రభుత్వం 43 లక్షల రూపాయలు వెచ్చించింది. పథకం నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్న తాగునీరు మాత్రం కాలనీవాసులకు పంపిణీ చేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు ఏర్పాటు కావడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ రక్షిత నీటి పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని కొందరు పేర్కొంటున్నారు. రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయని పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. రాజకీయాలకతీతంగా ఈ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రక్షిత పథకం ద్వారా నీటి సరఫరా జరిగేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## వెలగని వీధి దీపాలు



నరసన్నపేటలోని పలు వీధులతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద వద్ద ఉన్న వీధి దీపాలు వెలగలేదు. నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్, పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాలలో వీధిలైట్లు వెలగకపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటోంది.

# మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి



**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు12(వార్త):** నరసన్న పేట పట్టణంలో 12 వ వార్డు శివనగర్ కాలనీలో పరిధిలో కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, ఇంటింటికి తాగునీరు కులాయి పనులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక వస తుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, శిమ్మ చంద్రశేఖర్, జామి వెంకట్రావు, గొద్దు చిట్టిబాబు, ఊన్న వేంక టేశ్వరరావు, సరిపల్లి మధు, సాసుపల్లి కృష్ణ బాబు, భైరి భాస్కరరావు, బోయిన సతీష్, కింజరాపు రామారావు,బలగ ప్రహర్ష,గొలివి రామారావు, రావాడ గణపతి రావు, మొయ్యి హరికృష్ణ, గొలివి గణేష్, చీరంజీవి, వారణాసి రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఐవో దుర్గారావు పదవీ విరమణ వేడుక




**జలుమూరు, అక్టోబరు12(వార్త):** శ్రీకాకుళం జిల్లా విద్యారంగానికి విశేష సేవలందించిన ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు పదవీ విరమణ వేడుక చల్లవానిపేటలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించి మండల విద్యా శాఖ అధికారి, ప్రిన్సిపాల్, ఆర్ఐఓగా వివిధ ఉన్నత పదవులను దుర్గారావు అలంక రించారని పలువురు కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ మాజీ అధ్య క్షులు బగ్గు లక్ష్మణరావు మాట్లాడుతూ దుర్గారావు క్రమశిక్షణ, అంకితభావంతో విధు లు నిర్వహించి ఉపాధ్యాయ సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్ర మంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు12 (వార్త):** నరసన్నపేట పట్టణం లోని ప్రైవేట్ కళాశాల వసతి గృహంలో శక్తి టీం ఆధ్వర్యంలో శక్తి యాప్ అవ గాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శక్తి యాప్ టోల్ ఫ్రీ నంబర్ల వివ రాలు, పని చేయు విధానం విద్యార్థులకు తెలియజేశారు. పోక్సో చట్టం, యాంటీ డ్రగ్స్, మత్తు పానీయాల నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు, మహిళా చట్టాలపై విద్యార్థులకు తెలియజేశారు. శక్తి టీం ఇన్ఛార్జి గిరిధర్, సభ్యులు పాల్గొన్నారు.






## వైసీపీ కోటి సంతకాల సేకరణ

**ఇచ్ఛాపురం,అక్టోబరు11(వార్త):** కొఠారి గ్రామంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, నియోజకవర్గ సమన్వయ కర్త పిరియా విజయ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల వ్యవహారంలో అనుసరిస్తున్న తప్పుడు విధానాలను నిరసిస్తూ కోటి సంతకాలు సేకరించే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర, ఎంపిపి బోర పుష్ప, రాష్ట్ర సీడప్ కార్పొ రేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ ప్రతినిధి సల్ల దేవరాజ్, స్థానిక సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, భాగ మోహనరావు, సర్పంచ్ గుజ్జు ఢిల్లీ రావు, యాదవ రెడ్డి, దుక్క ఆనంద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతం

**విజయనగరం, అక్టోబరు 12(వార్త):** పి.ఆర్. ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సి.హెచ్.మహంతి, రాష్ట్ర కోశాధికారి జి.వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమావేశాన్ని విజయనగరం జిల్లా అధ్యక్షులు యు.సోములు, కార్యదర్శి కె.ప్రసాద్, కోశాధికారి వి.నీరజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి కె.సి.హెచ్. మహంతి అసోసియేషన్ గత సంవత్సరపు కార్యకలాపాల నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గం తరఫున అనేక ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ పథకం కింద ఇంజనీరింగ్ విభాగం పాత్రను బలోపేతం చేయడం, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఎదురవుతున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించడం, సిబ్బంది సర్వీస్ రూల్స్ రూపకల్పన, సవరణలకు సంబంధించిన సూచనలు, ఇంజినీర్లకు తగిన ప్రమోషన్లు, బదిలీలు, సేవా పరిరక్షణ అంశాలపై చర్చించారు. గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవ్వడంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని, ప్రతి సభ్యుడు సమాజ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని సూచించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



శ్రీకాకుళం

## 13 మద్యం షాపుల్లో శాంపిల్స్ సేకరణ

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు12(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలలో శాంపిల్స్ సేకరణ చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ సీఐ లీలరాణి, ఎక్సైజ్ శాఖ ఎస్సై ఎస్ గురుమూర్తి తెలిపారు. శనివారం సాయంత్రం నరసన్నపేట, పోలాకి మండలాల్లోని 13 మద్యం షాపులలో శాంపిల్స్ సేకరించామని వారు తెలిపారు. మద్యం విధానంలో పెను మార్పులు జరుగుతున్న నేపథ్యంలో అక్రమ మద్యం నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని వారు పేర్కొన్నారు. వీటిని ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు.



## డీలర్ల దోపిడీ

### * ఒక్కో కార్డు నుంచి రెండు కేజీల వరకూ తగ్గించి బియ్యం పంపిణీ * ఎవరైనా ప్రశ్నిస్తే ఇది మామూలే అంటున్న డీలర్లు

**సరుబుజ్జిలి, అక్టోబరు12 (వార్త):** కూటమి సర్కార్ వచ్చాక రేషన్ డీలర్ల వ్యవస్థను మళ్లీ తీసుకువచ్చింది. కార్డుదారులకు డిపోల వద్ద నుంచే రేషన్‌ను పంపిణీ చేస్తున్నారు. అయితే సరుబుజ్జిలి మండలంలో కొందరు డీలర్లు బియ్యాన్ని పంపిణీ చేసే సమయంలో రెండు కేజీల వరకూ తగ్గించి కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల దసరా సమయంలో కూడా ఒక్కో కార్డుదారుడి నుంచి దసరా మామూళ్ల పేరిట రూ.30లు వసూలు చేశారు. అలాగే ప్రభుత్వం పేదలకు పేదలకు సంతులిత ఆహారం అందించే భాగంగా రాగులను కూడా రేషన్ డీలర్ల ద్వారా అందిస్తోంది. అయితే చాలామంది కార్డుదారులు రాగులు తీసుకోవడం లేదన్న నెపంతో డీలర్లు వాటిని ఇవ్వడం లేదు. రేషన్ పంపిణీలో కోతపై కార్డుదారులు ఎవరైనా ప్రశ్నిస్తే ఇది మామూలేనని, పౌరసరఫరా శాఖ అధికారులకు నెలవారీ మామూళ్లు ఇవ్వాల్సి వుంటుందని, గొడౌన్ నుంచి వచ్చే బియ్యం బస్తాల్లో తరుగు వస్తోందని, దీనివల్ల తాము కార్డుదారులకు కోత విధించాల్సివస్తోందని డీలర్లు బహిరంగంగానే పేర్కొంటున్నారు. పౌరసరఫరాల శాఖాధికారులు స్పందించి డీలర్ల దోపిడీపై విచారణ చేపట్టి కార్డుదారులకు సక్రమంగా బియ్యం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.





## మందసలో మొక్కలు నాటిన గో గ్రీన్ మందస నాయకులు

**మందస, అక్టోబరు 12(వార్త):** గోగ్రీన్ మందస ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మందస పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం నుండి శాసనం వీధి జంక్షన్ వరకు మొక్కలు నాటే కార్యక్రమం గో గ్రీన్ మందస నాయకులు చేపట్టారు. ప్రతీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి 8 గంటల వరకు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంఘ సేవకుడు, గో గ్రీన్ సభ్యుడు గిన్ని తిరుపతిరెడ్డి తెలిపారు. జనసేన జిల్లా నాయకుడు సంతోష్ పండా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడమే కాకుండా మెయిన్ రోడ్డు ను పచ్చగా తీర్చిదిద్దడం అవుతుందన్నారు. గోగ్రీన్ ప్రతినిధి సీహెచ్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. నీల్-మోహన్ రిసోర్స్ ఫౌండేషన్ డైరెక్టర్ పట్నాల మోహనాచారి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మామిడి కోదండరావు, శ్రీనివాస్ పాడి, రామారావు, సింహాచలపతి, మల్లారెడ్డి రాజు, దున్న హరికృష్ణ, కె.ప్రసాద్, నాగేశ్వరరావు, పొందూరు కేశవరావు, రాధాకృష్ణ పట్నాయక్ ఇప్పిలి కేశవరావు(చిట్టి), హరి పాల్గొన్నారు.


## జనసేన నేతపై కేసు

**ఇచ్ఛాపురం, అక్టోబరు12(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, అతని కుటుంబ సభ్యులపై టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి వల్లభ రావు చెప్పారు. అప్పన్నపేటలో రాజు మామ కాళ్ల పాపారావు ఇంటి దగ్గర జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఇరు కుటుంబాలకు గాయాలయ్యాయని చెప్పారు. మోహిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాజు తల్లి ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కాళ్ళ పాపారావు మరో ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

### * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి, అక్టోబరు 12 (వార్త):**ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయి. నూతన పింఛన్లు, గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయన్నారు. త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులలో అలసత్వం లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు.



## పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత



**శ్రీకాకుళం, అక్టోబరు12(వార్త):** పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యతని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. నగరంలో గల స్థానిక 80ఫీట్ రోడ్‌లోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో డిజిటల్ క్రియేట్ మూమెంట్, ఈకో 75 అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలన్నారు. ఆ మొక్క ఎలా పెరుగుతుందో వాటి సంరక్షణ చూసుకోవటానికి ఒక యాప్‌ను తయారు చేయడం వినూత్నమైన ఆలోచనని పేర్కొన్నారు. ఈ యాప్‌ను తయారు చేసిన చందు యువతూరి పాలకొండ ప్రశాంత్ బృందాన్ని ప్రశంసించారు. యాప్ ను తయారుచేసిన చందు యువతూరి మాట్లాడుతూ ప్రతి మొక్కకు ఒక క్యూఆర్ కోడ్ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ యాప్ ద్వారా మొక్క యొక్క ఫోటోలను జియో టాగింగ్‌తో అప్లోడ్ చేయవచ్చున్నారు. ఈ యాప్ ద్వారా నాటబడిన అన్ని మొక్కలను మిగతావారు కూడా పరిశీలించవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం 75 వసంతాల గుర్తుగా 75 మొక్కలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. భవిష్యత్తులో ఈ మొక్కలు 75 తోనే కాకుండా వేలు లక్షల సంఖ్యకు చేరాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద రావు, డిప్యూటీ డీఎఫ్ఓ నాగేంద్రరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నటుకుల మోహనరావు, పొన్నాడ రవికుమార్, హారిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అరసవల్లికి పోటెత్తిన భక్తులు

**అరసవల్లి, అక్టోబరు12 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. టికెట్లు రూపేనా రూ.3,16,500, పూజలు, విరాళాల రూపంలో రూ.80,073, ప్రసాదాల రూపంలో రూ.2,09,610లు స్వామి వారికి ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

## జంగిల్ క్లియరెన్స్ చేపట్టండి

**జలుమూరు, అక్టోబరు12(వార్త):** టెక్కలిపాడు గ్రామానికి నరసన్నపేట నుంచి వెళ్లే రహదారికి ఇరు వైపుల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. రహదారికి ఇరువైపులా తుప్పలు పెరగడంతో వాహనదారులు తెలిపారు. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




## ముంపులో రైల్వే అండర్ పాసేజ్

**జలుమూరు, అక్టోబరు12 (వార్త):** బసివాడ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన రైల్వే అండర్ పాసేజ్ నిత్యం ముంపులోనే ఉంటోంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ పాసేజ్ వద్ద మురుగునీరు నిల్వ ఉండిపోవటంతో పాటు నాచు పట్టడంతో రహదారిలో వాహనాలు వెళ్లేటప్పుడు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు లేకుండా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు.



## చిన్నారికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం

**మందస, అక్టోబరు 12(వార్త):** న్యూమోనియా వ్యాధి సోకిన ఓ చిన్నారికి సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది. కొతారి గ్రామనికి చెందిన బండారు పావని కుమార్తె దీయా అనే చిన్నారికి న్యూమోనియా వ్యాధి సోకింది. శ్రీకాకుళంలో ఉన్న రిమ్స్ హాస్పిటల్లో వెంటిలేటర్‌పై వైద్యం పొందేది. పాప పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. తల్లితండ్రులు పేదవారు కావడంతో కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో విషయం తెలుసుకొన్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు 10000 రూపాయలు అందించారు. మెరుగైన వైద్యం కోసం దాతల సహాయం కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సరస్వతి, భవిత, భూపతిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వర్తమానం నుండి గతం వైపు పుస్తకం విలువైనది

**మందస, అక్టోబరు 12(వార్త):** 'వర్తమానం నుండి గతం వైపు' పుస్తకం చాలా విలువైనదని వక్తలు అన్నారు. వర్తమానం నుండి గతంవైపు పుస్తక పరిచయ సభ హరిపురంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీస్‌లో ఘనంగా జరిగింది. ప్రజా విజ్ఞాన వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహన రావు అధ్యక్షత వహించారు. పుస్తక పరిచయకర్తలుగా రజితేంద్ర రెడ్డి, మట్ట ఖగేశ్వరరావు వ్యవహరించారు. రజితేంద్రరెడ్డి పుస్తకాన్ని సమీక్షించారు. సమాజంలో ఒక విలువైన పుస్తకంగా నిలుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైన అంశం ఆలోచన ఈ ఆలోచనలలో వర్గ స్వభావాన్ని అర్థం చేసుకున్నపుడే సమాజాన్ని అభివృద్ధి పథంలో నడపగలమన్న విశ్లేషణ అత్యంత గొప్పదని అన్నారు. సామాజిక కార్యకర్త డాక్టర్ మట్ట ఖగేశ్వరావు మాట్లాడుతూ దేశంలో కనిపిస్తున్న అనేక రుగ్మతలను కర్మ సిద్ధాంతాలతో ముడిపెట్టిన ఆశాస్త్రీయ అంశాలను వెలికి తీసిన అంశాలను సమాజంలో అందరికి తెలిసేటట్టు మనం ప్రయత్నం చేయాలన్నారు. అప్పుడే రచయిత చేసిన తీవ్రమైన కృషి సాఫల్యం చెందుతుందన్నారు. శ్రమ పడే వాళ్లని అణగదొక్కడమే మూఢనమ్మకాల అంతిమ లక్షణమన్నారు. నేడున్న పరిస్థితిలో ఈ పుస్తకం గడిచిన చరిత్రకు అద్దం పడుతోందని, ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని సూచించారు. భూమి ఉత్పత్తిలో కీలకమైన అంశమని, అలాంటి భూమిని ప్రజలకు దూరం చేసి బానిసలుగా మార్చుతున్నారని చెప్పారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.బీమారావు, యూటీఎఫ్ జిల్లా సెక్రటరీ గున్న రమేష్, చౌదరి హేమారావు సమాజంలో పుస్తకం ఆవశ్యకత గురించి మాట్లాడారు. అనంతరం రచయిత మామిడి కోదండరావుకు పలువురు అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ నాయకుడు ఈశ్వరరావు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో గొలుసు మురళి, దాసరి తాతారావు, దువ్వాడ దామోదరం, రౌతు చిరంజీవి, మార్పు వెంకటరమణ, డి.వెంకట్రావు, మార్పు మన్మధరావు, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546